క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గరిడేపల్లి: మండల పరిధిలోని గానుగబండ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సాయికృష్ణ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా గోవిందరావు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని పద్మశాలీ భవనంలో ఆదివారం పద్మశాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడిగా బొద్దు గోవిందరావును ఎన్నుకున్నారు. ఈమేరకు ఆయనకు నియామకపత్రం అందజేశారు.

సమసమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

మఠంపల్లి: సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మఠంపల్లి మండలంలోని వరదాపురంలో నిర్వహించిన సీపీఐ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతన్నకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. నిరుద్యోగ భృతికి, హరిజన, గిరిజన, ముస్లిం, మైనార్టీల హక్కులకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు, సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను రామయ్య, జలాలుద్దీన్, అలీబాబా, సుబ్బారావు, వెంకటయ్య, చిన్నజాను, జానీబాషా, పెద్ద సైదులు, మీరావలి, సతీష్, సైదా, ఇన్నయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా చింతిరాల రవి



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సీపీఐ చింతలపాలెం మండల కార్యదర్శిగా అదే గ్రామానికి చెందిన చింతిరాల రవి మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో తనతో 13 మంది మండల కౌన్సిల్ సభ్యులు, ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీఎల్‌ఎం మెటీరియల్ అందజేత

గరిడేపల్లి: దివ్యాంగుల కోసం భవిత సెంటర్‌కు టీఎల్‌ఎం మెటీరియల్‌ను ఎంఈఓ చత్రునాయక్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఐఆర్పీ అవంతిక, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏబీపీపీ అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఇస్లావత్ నగేష్

సూర్యాపేట : అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ (ఏబీపీపీ) సూర్యాపేట జిల్లా శాఖ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఏబీపీపీ జోనల్ సెక్రటరీ ఇస్లావత్ నగేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ ద్వారా శబరిమల దగ్గర నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలతో విరాళాలు అందించేందుకు సంస్థ ద్వారా కృషి చేయాలన్నారు. జులై 19, 20 తేదీల్లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి జిల్లా నుంచి ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

9,811 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

నేరేడుచర్ల : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 9,811 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. 85 మంది రైతుల వద్ద నుంచి 24,529 బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని, వీటికి సంబంధించిన బిల్లులను పౌరసరఫరాల శాఖకు పంపించగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారని పేర్కొన్నారు.

గుంతలమయంగా రోడ్డు

నడిగూడెం : మండల పరిధిలోని వేణుగోపాలపురం నుంచి వీరాంజనేయనగర్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. పలు చోట్ల లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


వేణుగోపాలపురం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

కార్యాలయం ఎదుటే చెత్తకుప్ప

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట భారీగా చెత్త పేరుకుపోయింది. ఇదే కార్యాలయంలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం కూడా ఉండటంతో విద్యుత్ వినియోగదారులు ఈ కార్యాలయానికి తరుచూ వస్తుంటారు. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈ చెత్తకుప్ప తడిసి దుర్వాసన వెదజల్లు తోందని పలువురు పేర్కొంటున్నారు. అంతే కాకుండా సాయంత్రం ఈగలు, దోమలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త కుప్పను తొలగించాలని కోరుతున్నారు.


విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట ఉన్న చెత్తకుప్ప

వన మహోత్సవానికి సిద్ధం

- 17 గ్రామ పంచాయతీల్లో 1.80 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- రోడ్లు, పాఠశాలలు, కళాశాలల్లో నాటిన తరువాత ఇంటింటికీ పంపిణీ
- నర్సరీలను పర్యవేక్షిస్తున్న అధికారులు


చిలుకూరు మండలం దూదియాతండాలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు

చిలుకూరు: వన మహోత్సవానికి చిలుకూరు మండలంలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో 1.80 లక్షలు మొక్కలు సిద్ధంగా ఉంచారు. ఈ మొక్కలను ఈ ఏడాది తొలకరి వర్షాలు కురవగానే గ్రామాల్లో రోడ్లు, ప్రధాన రహదారుల వెంట, పాఠశాలలు, కళాశాలల్లో నాటిన తరువాత ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. నర్సరీల్లో ప్రస్తుతం టేకు, దానిమ్మ, జామ, బొప్పాయి, సీతాఫలం, గుల్‌మోర్, గుమ్మడి టేకు, వేప, చింత, గానుగ, శ్రీ గంధం, మలబారు వేప, పూల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి రోజు నర్సరీల్లో మొక్కలకు నీళ్లు పోస్తూ, ఎండలకు ఎండిపోకుండా ఉండేందుకు గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేశారు. నర్సరీలను జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.


కొండాపురంలోని నర్సరీ

లక్షా 80 వేల మొక్కలు పెంచుతున్నాం

చిలుకూరు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో లక్షా 80 వేల మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు పడగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతాం. మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసి నాటేలా చూస్తాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు మండలం

కార్యకర్తలకు అండగా ఉంటా

నడిగూడెం : కార్యకర్తలకు అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండారు కవితారెడ్డి అన్నారు. ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం నడిగూడేనికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ముప్పారపు చిన కొండయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నడిగూడెం సమీపంలోని గట్టుమైసమ్మ, రామాపురం వద్ద బాలగురప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండారు వీరబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి రౌతు కళ్యాణ్, మండల మాజీ అధ్యక్షుడు రొండ్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు కేశగాని పాపయ్య, మూల భిక్షంరెడ్డి, గంధం గురుస్వామి, ఉపేంద్ర కుమారి, గోపి పాల్గొన్నారు.


చిన కొండయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న బండారు కవితారెడ్డి

ముగిసిన వృత్యంతర శిక్షణ

మునగాల: మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న పునశ్చరణ వృత్యంతర శిక్షణ ఆదివారం ముగిసింది. మూడవ తరగతి పూర్తయ్యేనాటికి విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలను గణితంలో చేయడం వంటి గుణాత్మక విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆగస్టు 15నాటికి ప్రతి విద్యార్థిలో కనీస సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు కోరారు. శిక్షణకు సహకరించిన ఎమ్మార్పీ, సీఆర్పీలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈఓ ధన్యవాదాలు తెలిపారు.


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మేరీమాత ఉత్సవాలు

గరిడేపల్లి: మండల పరిధిలోని కుత్బుషాపురం గ్రామంలో ఆదివారం మేరీమాత ఆలయ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మేరీమాత ఆలయానికి సంఘం సభ్యుడు ఆకుల అరవింద్ గంటను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ములకలపల్లి కుమారి మృతి బాధాకరం


కుమారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు


ములకపల్లి రాములును పరామర్శిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మునగాల: మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ములకపల్లి రాములు సతీమణి ములకలపల్లి కుమారి మృతి బాధాకరమని మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అన్నారు. ఆదివారం కొక్కిరేణిలో కుమారి చిత్రపటం ఎదుట నివాళులర్పించారు. అనంతరం రాములును పరామర్శించారు. వారిలో మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాదిగ, రాష్ట్ర నాయకులు బొల్లికొండ కోటయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాతకొట్ల నాగరాజు, కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ, శ్రీను మాదిగ , గ్రామశాఖ అధ్యక్షుడు పులి వెంకన్న పలువురు పాల్గొన్నారు.

కుమారి మృతికి సంతాపం

కుమారి మృతిపట్ల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కొమ్ము ఈదారావు, ఓరుగంటి రవి, ఐతరాజు వీరయ్య, పోటు కుమార్, గట్టు ఉపేందర్, సీపీఎం నాయకులు దేవరం వెంకటరెడ్డి ఉన్నారు.

సీపీఎం నేతకు డీవైఎఫ్ఐ నాయకుల పరామర్శ

మునగాల: మండలంలోని కొక్కిరేణికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందింది. ఆదివారం డీవైఎఫ్ఐ నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి కుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మ సతీష్, డీవైఎఫ్ఐ మండల కమిటీ కార్యదర్శి వినోద్, సైదులు, షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుచేయాలి

మునగాల: రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, లేకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గత ప్రభుత్వం హయాంలో కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్టుదుకాణాలకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. దీంతో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పలు పేదవర్గాలకు చెందిన వారు మద్యానికి బానిసై జీవితాలను, కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. పేదల జీవితాలతో ఆడుకుంటున్న మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు.

లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సూర్యాపేట అర్బన్ : భారత రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన పార్టీ పట్టణ నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలు, దళితులు, బహుజనులు నేటికి రాజ్యాంగ హక్కులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా భావాలను వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్లు, దేశ ద్రోహి అంటున్నారని, ప్రభుత్వం దేశ ప్రజలతో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు, పోరాటాలు నెలకొంటున్నాయని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదాన్ని మట్టి పెట్టడాన్ని సీపీఐ హర్షిస్తుందన్నారు. బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యులు కేవీఎల్, అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని నాగభూషణం, బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, దొరపల్లి శంకర్, రాము, రాజారాం, రేగటి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొమ్మగాని ప్రభాకర్

జలగం జనార్దన్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

మోతె: జలగం జనార్దన్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ అన్నారు. ఆదివారం మోతె మండలంలోని రావిపహాడ్ గ్రామంలో నిర్వహించిన జనార్దన్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. జలగం జనార్దన్ తన జీవితమంతా పేద ప్రజల హక్కుల కోసం పోరాటాలు చేశారన్నారు. దున్నేవానికే భూమి కావాలని ప్రజా ఉద్యమాలతో 14 సంవత్సరాలు అజ్ఞాతంలో గడిపి తన జీవితాన్నే పార్టీకి దారపోశారన్నారు. వీరాచారి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు సైదులు, రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ముత్తయ్య, లింగయ్య పాల్గొన్నారు.

తీరనున్న సాగునీటి కష్టాలు

- మోతె లిఫ్టుతో చివరి ఆయకట్టు భూములకు చేరనున్న సాగు నీరు
- పథకం నిర్మాణానికి రూ.244 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ


పాలేరు జలాశయం

మోతె: పాలేరు జలాలు ఎత్తిపోతల కింద చివరి ఆయకట్టు రైతులకు ఏటా ఎదురవుతున్న సాగు నీటి కష్టాలు తీరనున్నాయి. ఎస్సారెస్పీ డీబీఎం 71 ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న కోదాడ నియోజకవర్గంలో 36 ఎల్, 22 ఎల్ మైనర్ కాల్వల పరిధిలో ఉన్న మోతె, మునగాల, నడిగూడెం మండలాల రైతులకు ఏటా సాగునీరు అందడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ఆయకట్టు చివరన ఉన్న మండలాలకు ఎస్సారెస్పీ కాల్వలనే వినియోగిస్తూ సాగు నీటి కొరత తీర్చేందుకు పక్కనే ఉన్న పాలేరు జలాశయం ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు అధికారులను ఆదేశించారు. ఇందుకు గతంలోనే ఈ పథకం ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేసి అంచనాలు రూపొందించి డీపీఆర్ సమర్పించారు. దీనిని అనుమతిస్తూ నీటి పారుదలశాఖ ఎత్తిపోతల పథకం నిర్మాణ పరిపాలన అనుమతులకు ఆమోదం పొందింది. ఈ పథకం నిర్మాణానికి రూ.244 కోట్లు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

మూడు మండలాలకు సాగు నీరు

మున్నేరు ద్వారా ఖమ్మం జిల్లా గార్ల మండలం దుబ్బగూడెం చెక్ డ్యాం నుంచి గ్రావిటీ ద్వారా పాలేరు జలాశయంలో అదనపు నీటి నిల్వలను అందుబాటులోకి తెచ్చి వీటిని మోతె ఎత్తిపోతల పథకానికి మళ్లించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. మోతె లిఫ్టుతో ఎస్సారెస్పీ 36, 22 ఎల్ కాల్వల పరిధిలో మూడు మండలాల్లో 47,736 ఎకరాలకు సాగు నీరు అందనుంది. మోతె, కూసుమంచి మండలాల సరిహద్దు ప్రాంతంలోని పాలేరు జలాశయంలో నాయకన్‌గూడెం-అన్నారిగూడెం గ్రామాల మధ్య బోడబండ్లగూడెం గ్రామం కింద ఎత్తిపోతలకు పంపు హౌజ్ నిర్మాణం జరిగే ప్రదేశాన్ని గుర్తించారు. ఇక్కడి నుంచి మండలంలో 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న భల్లుతండా వద్ద 36 ఎల్ కాల్వలో ఒక డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. ఇదే పైప్‌లైన్‌కు సిరికొండ వద్ద మధ్యలో మరో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తారు. 2 మీటర్ల వెడల్పు ఉన్న పైపుల ద్వారా రెండు మోటార్లతో 450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నారు. ఇందులో 36 ఎల్ కాల్వ పరిధిలో 350 క్యూసెక్కులు, 22 ఎల్ కాల్వకు వెళ్లే పైప్‌లైన్‌కు 150 క్యూసెక్కుల నీటిని నిత్యం తరలించనున్నారు. జలాశయం నుంచి ఆయా కాల్వలకు ఎత్తిపోసిన నీటిని మైనరు కాల్వలకు అనుసంధానంగా ఉన్న సబ్ మైనర్ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటిని తరలించేలా డిజైన్ చేశారు.

కోలాట పోటీల విజేతలకు బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకుడు రాంబాబు

మునగాల: మండలంలోని నేలమర్రిలో ఆదివారం గ్రామ కళాకారుల ఆధ్వర్యంలో నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన కోలాట పోటీల్లో విజేతలకు నిర్వాహకుడు బచ్చలకూరి రాంబాబు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మేళ్లచెరువు మండలం దుబ్బతండాకు చెందిన టీం గెలుచుకోగా, ద్వితీయ బహుమతి సూర్యాపేట మండలం రాజునాయిక్ తండా, తృతీయ బహుమతి నేలమర్రికి చెందిన రేలా కోలాట బృందం గెలుచుకున్నట్లు రాంబాబు తెలిపారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


మునగాల: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


నడిగూడెంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మీయ సమ్మేళనం

మునగాల: మండలంలోని కొక్కిరేణిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత ఒక వేదికపై కలుసుకున్న వారు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు పోటు సీతారామయ్య, వేదం రంగయ్య, రాము, అంకయ్య, రామిరెడ్డి, నరసింహారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం 2007 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు రమణమ్మ, అనురాధ, చాంప్లా, నెహ్రూ, రాంబాబు, ఎస్ఎస్.మూర్తి, కోటయ్య పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

చిలుకూరు : మండల కేంద్రం నుంచి పాత చిలుకూరుకు వెళ్లే దారిలో అంతర్గంగ వంతెన వద్ద కల్లు గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠ మహేశ్వర సురమాంబదేవి ఆలయ ప్రారంభోత్సవానికి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. 5న గ్రామానికి స్వామిఅమ్మవారి విగ్రహాలను తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6న జెండా మర్రి దగ్గర జెండాల ఊరేగింపు, 7న గ్రామంలో విగ్రహాల ఊరేగింపు, 8న ఆలయ ప్రారంభోత్సవం అనంతరం విగ్రహాల ప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణం, అన్నదానం, 9న పాత కాటమయ్య గుడి దగ్గర బలి చల్లుట, జాతర ఉంటుందని వారు పేర్కొన్నారు.


నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర ఆలయం

ప్రమాదకరంగా గేట్‌వాల్వ్ గుంత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని విజ్ఞాన్ నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మాధవరాయినిగూడెం, రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లే చౌరస్తాలో రోడ్డు మధ్యలో గేట్‌వాల్వ్ గుంత ప్రమాదకరంగా ఉంది. పలువురు వాహనదారులు. పాదచారులు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ఈ గుంత కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గేట్‌వాల్వ్ గుంతపై మూత ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత